క్లుప్తంగా

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు


పింఛన్ సొమ్ము అందిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: గ్రామాల్లో అర్హులై ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు మంజూరవుతాయని సర్పంచ్ నంద్యాల రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నేత ఎస్సీ.రంగయ్య తెలిపారు. బుధవారం టి.కొతపల్లిలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకలను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రతినెలా 1 తేదీనే సూర్యుడు ఉదయించక ముందే ఇళ్ల వద్దకు వలంటీర్లు వచ్చి పింఛన్ అందిస్తున్నారన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, వలంటీర్ సుగుణ పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న దృశ్యం

యల్లనూరు: తిరుమలాపురానికి చెందిన ఆరుగురు రౌడీషీటర్లు, బెల్టుషాపు నిర్వాహకులను బుధవారం తహసీల్దార్ సుమతి సమక్షంలో బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ ధరణిబాబు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా బైండోవర్ చేస్తున్నామన్నారు.
పెద్దపప్పూరు: చీమలవాగుపల్లిలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామకృష్ణ ఇంటిపై కట్టెలు, రాళ్లతో దాడికి పాల్పడిన జేసీ వర్గీయులను బుధవారం ఎస్‌ఐ శరత్‌చంద్ర తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి గొడవల జోలికి వెళ్లకూడదని నిందితులు సత్యనారాయణ రెడ్డి, రమణ, రామేశ్వర్ రెడ్డి, తులసిరాముడును తహసీల్దార్ లక్ష్మానాయక్ హెచ్చరించారు.

గ్రంథాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

బుక్కరాయసముద్రం: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా లైబ్రరీలో రికార్డులను పరిశీలించారు. లైబ్రరీలో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి, ఏఏ పత్రికలు వస్తున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల నుంచి గ్రంథాలయ పన్ను వసూలు చేయాలన్నారు. గ్రంథాలయాధికారి విజయ భాస్కర్ ఉన్నారు.

జేవీవీ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ విడుదల చేస్తున్న నాయకులు

గుత్తి: పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో బుధవారం జేవీవీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జేవీవీ జిల్లా, మండలాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, రామాంజనేయులు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రంగన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ క్యాలెండర్‌లో అందరికీ ఉపయోగ పడే అంశాలు అనేకం ఉన్నాయన్నారు. నాయకులు దేశాయి నాగరాజు, శ్రీధర్ గౌడ్, సుధాకర్ బాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ

విడపనకల్లు: మండల పరిధిలోని ఆంధ్రా, కర్ణాటక సరిహద్దులోని హావలిగి, విడపనకల్లు చెక్‌పోస్టులను గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప బుధవారం తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి మద్యం, నగదు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సూచించారు. అనంతరం పాల్తూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఉరవకొండ సీఐ ప్రవీణ్‌కుమార్, పాల్తూరు ఎస్‌ఐ తిప్పయ్య నాయక్ పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ


శివపార్వతులకు పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: కూడేరులో స్వయంభుగా వెలసిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మాసశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జోడు లింగాలకు ఆలయ పురోహితులు శివశంకర్ శాస్త్రి, మహేష్, ప్రవీణ్ స్వాములు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శివపార్వతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రీడల్లో నైపుణ్యం పెంపే లక్ష్యం


పెద్దపప్పూరు మండలం నరసాపురంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరామిరెడ్డి


గుత్తిలో మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం


గార్లదిన్నెలో కబడ్డీ ఆడుతున్న యువకులు

పెద్దవడుగూరు : క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ రాముడు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. మండలస్థాయిలో గెలుపొందిన జట్లను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.
పెద్దపప్పూరు: పట్టుదల ఉంటే ఏ క్రీడలోనైనా రాణించవచ్చని ఎంపీపీ వెంకరటామిరెడ్డి(రామయ్య) అన్నారు. బుధవారం నరసాపురం జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించడానికే ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. ముచ్చుకోట గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి క్రీడాకారులకు క్రీడాసామగ్రిని వైఅందజేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓఆర్డీ కమలాబాయి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, స్థానిక నేతలు రామాంజులరెడ్డి, రామచంద్ర (కాశీ)పీడీలు పాల్గొన్నారు.
గుత్తి: క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారే అసలైన విజేతలని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గుత్తిలోని ఎంఎస్ క్రీడా మైదానంలో బుధవారం మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఎంఈఓ రవినాయక్, సచివాలయ ఉద్యోగులు, పీఈటీలు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, సచివాలయ కన్వీనర్ రంగస్వామి, షఫి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.
తాడిపత్రి అర్బన్: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా సంజీవనగర్ సచివాలయ పరిధిలో బుధవారం భగత్‌సింగ్ నగర్ కింగ్స్, సంజీవనగర్ ఈగిల్స్‌కు మధ్య వాలీబాల్ పోటీ జరిగింది. భగత్‌సింగ్‌నగర్ కింగ్స్ విజయం సాధించడంతో భగత్‌సింగ్‌నగర్ సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్ క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.
పుట్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడాపోటీలు ఆసక్తికరంగా సాగాయి. క్రికెట్‌లో పుట్లూరు, కుమ్మనమల, కడవకల్లు జట్లు గెలుపొందాయి. ఖోఖోలో కడవకల్లు, బ్యాడ్మింటన్‌లో గూడూరు జట్టు గెలుపొందినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు పాల్గొన్నారు.


తాడిపత్రిలో వాలీబాల్ విజేతలకు బహుమతి అందిస్తున్న మనోజ్

గార్లదిన్నె: మండల కేంద్రంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను సర్పంచు సుబ్బమ్మ, ఎంపీపీ వెంకటనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, దుస్తులు అందజేసిందన్నారు. ఈనెల 23 వరకు మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, సొసైటీ డైరెక్టర్ వెంకటశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
యల్లనూరు: యల్లనూరు హైస్కూల్, చిలమకూరు మోడల్ స్కూల్లో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మండల ప్రత్యేకాధికారి ఫిరోజ్‌ఖాన్, ఎంపీపీ గంగాదేవి ప్రారంభించారు. సర్పంచులు పెద్ద ఓబులమ్మ, పెద్దనాగరాజు, ఎంపీటీసీలు తిమోతి, ఆదినారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కిరణ్, ఎంపీడీఓ వీరరాజు, ఎంఈఓ-2 వరమేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, పీడీలు పాల్గొన్నారు.
యాడికి: యాడికి ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ వద్ద బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. క్రికెట్ క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. అంతకుమును యాడికి ఉన్నత పాఠశాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంఈఓలు కాశప్ప, ధనలక్ష్మి, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, నాయకులు జయకృష్ణ, బాలిరెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.
బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్, సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న ఆర్డీటీ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ప్రారంభించారు. ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచులు పార్వతి, సుధాకర్‌రెడ్డి, ఎస్టీ సెల్ కన్వీనర్ సాకే లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాబుకు రాయలసీమలో పర్యటించే అర్హత లేదు

గుత్తి రూరల్: రాయలసీమ అభివృద్ధిని అడ్డుకుంటున్న మాజీ సీఎం చంద్రబాబుకు రాయలసీమలో పర్యటించే అర్హత లేదని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణ శివార్లలోని కొత్తపేట గ్రామ శివారులోని ఐటీ వింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుపై చంద్రబాబు వైఖరి చెప్పాలన్నారు. దేశంలోనే అత్యల్ప వర్షపాతంలో అనంతపురం జిల్లా రెండో స్థానంలో ఉందని, వాటిలో దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేశారన్నారు. వాటి ఫలితంగానే రాయలసీమ వ్యాప్తంగా అన్ని చెరువులు, ప్రాజెక్టులు నీటితో పరవళ్లు తొక్కుతున్నాయన్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో శ్రీశైలంలో నీటి పంపింగ్ ఆలస్యంగా ప్రారంభం అయిందన్నారు. చంద్రబాబు సీఎంగా 14 ఏళ్లు ఉండి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయకపోగా సీమ అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్నాడన్నారు. ఇప్పుడు సీఎం జగన్ సీమ అభివృద్ధికి కృషి చేస్తుంటే టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ నాయకులు జ్ఞానేశ్వర్, హరిప్రసాద్‌రెడ్డి, తేజేశ్వర్, తారక్, మల్లికార్జున, దామోదర్, యాగంటి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

సామాజిక సాధికార యాత్ర విజయవంతం

• కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలో మంగళవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసిన నియోజకవర్గంలోని ప్రజలు, పార్టీ శ్రేణులందరికీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా చేకూర్చిన లబ్ధి ఎంతగా అభిమానాన్ని పెంచిందో యాత్రకు వచ్చిన జనాన్ని చూసిన ప్రత్యర్థి పార్టీలకు అర్థమైంటుందన్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణాలు, గ్రామాల నుంచి వేలాదిగా పాల్గొన్న ఈ యాత్ర పార్టీశ్రేణుల్లో మరింత జోష్‌ను నింపిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి ఎల్లప్పుడూ ఆశీర్వాదం అందించాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

సంక్షేమ సారథికి పట్టం కట్టండి


తాడిపత్రిలోని 34వ వార్డులో పర్యటిస్తున్న యువ నాయకుడు సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సంక్షేమ సారథి సీఎం జగనన్నకు పట్టం కట్టాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం ఆయన 34వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై వారికి వివరించారు. అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. ప్రతి ఒక్క కుటుంబం సీఎం జగనన్న పాలనలో లబ్ధి పొందుతున్నారని, వచ్చే ఎన్నికల్లో అందరూ ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, బాలరాజు, అలీ, బాబా ఫకృద్దీన్ తదితరులు ఉన్నారు.
తాడిపత్రిటౌన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తనయుడు యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. చిన్న పోలమడ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు. సర్పంచ్ నాగేంద్రమ్మ జెడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, నాయకులు రమణారెడ్డి, భోగేశ్వరరెడ్డి, చంద్రలోకారెడ్డి, సురేష్ కుమార్, విజయ్, నరేంద్ర, ఎల్‌బాబు, రామ్మోహన్ రెడ్డి, వీరనాగప్ప పాల్గొన్నారు.

ట్యాంకర్ డ్రైవర్ల విధుల బహిష్కరణ


గుత్తి శివారులో బీపీసీఎల్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

గుత్తి రూరల్: కేంద్రం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ట్యాంకర్ల డ్రైవర్లు విధులను బహిష్కరించి పట్టణ శివార్లలోని బీపీసీఎల్ డిపో ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లు ఖలందర్, షరీఫ్, మహబూబ్‌బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత 106-2 హిట్ అండ్ రన్ అనే చట్టాన్ని తీసుకొచ్చి డ్రైవర్లను భయభ్రాంతులకు గురయ్యేలా చేస్తోందన్నారు. ఈ చట్టం ద్వారా రోడ్లపై అనుకోకుండా ప్రమాదాలు జరిగి ఎవరి ప్రాణాలైనా పోతే డ్రైవర్లకు 10 ఏళ్లు జైలు శిక్షతో పాటుగా రూ.7 లక్షలు జరిమానా విధిస్తారన్నారు. డ్రైవర్లు ఎవరూ ఉద్దేశ పూర్వకంగా ప్రమాదాలు చేయరని, అయితే ఈ చట్టం ద్వారా తమ వృత్తి ప్రమాదంలో పడుతోందన్నారు. ఈ నెల 14 అర్ధరాత్రి 12 గంటల వరకూ స్టీరింగ్ డౌన్ చేస్తున్నామన్నారు. డ్రైవర్లు శ్రీనివాసులు, గోపాల్, రామకృష్ణ, ఆంజనేయులు, రాముడు, నగేష్ పాల్గొన్నారు.
గార్లదిన్నె: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కల్లూరులో బుధవారం డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సంఘం సభ్యులు కంబగిరి, మురళీ, పెద్దనాయుడు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి


యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న సీఎండీ వెంకటేశ్వర్లు

గుంతకల్లు: రైల్వే ఆస్పతిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు సీఎండీ వెంకటేశ్వర్లుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని రైల్వే డివిజనల్ ఆస్పత్రిని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ మెడికల్ ఆఫీసర్ సీకే వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్ ఆయన్ను కలిసి రైల్వే ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో 7 నర్సింగ్ పోస్టులతోపాటు దాదాపు 27 ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వైద్యుల కొరతగా ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనియన్ నాయకులు రమేష్, శ్రీనివాస శర్మ, మేఘశ్యామ్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సీఎండీ రైల్వే ఆస్పత్రిలో పలు వార్డులను తనిఖీ చేశారు. ఓపీ సెంటర్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లిఫ్టును ప్రారంభించారు. రైల్వే ఆస్పత్రి సీఎంఎస్ గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి నిదర్శనం


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ రామాంజనేయులు


పి.కొండాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా, సామాజిక న్యాయానికి నిదర్శనంగా నిలవబోతుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంబేద్కర్‌నగర్‌తో పాటు పట్టణంలోని అని వార్డు సచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలు వేసి పాలాభిషేకం చేశారు. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19న ప్రారంభం కానున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం దేశం గర్వించేలా సిద్ధమైందన్నారు. కార్యక్రమాల్లో వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.
పామిడి: విజయవాడలో ఈనెల 19న బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణపై బుధవారం వైఎస్సార్‌సీపీ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పీ కొండాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అంబేడ్కర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు. వైఎస్సార్‌సీపీ 1వవార్డు ఇన్‌చార్జ్ ఎం రంగనాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రఘు సైనిక్ స్కూల్‌ను సీజ్ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న రఘు సైనిక్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈనెల 9 నుంచి 18 వరకూ ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ విద్యార్థులకు యథావిధిగా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల్ని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న రఘు సైనిక స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు, గిరి, నగర అధ్యక్షుడు భీమేష్ ఉన్నారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'

పామిడి: మండలంలోని నీలూరు, దేవరపల్లిలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలను వక్తలు వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, సర్పంచ్‌లు బెల్లాల ప్రమీలమ్మ, వై సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గార్లదిన్నె: మర్తాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మంజునాథ్ అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. నిందితుడి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్: బళ్లారి జిల్లా రూపనగుడికి చెందిన కళ్యాణకృష్ణ ముని అనే వ్యక్తి బుధవారం అక్రమంగా మద్యం తరలిస్తుండగా బొల్లనగుడ్డం చెక్‌పోస్టు వద్ద అతన్ని అరెస్టు చేసి 118 (90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజినేయులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

శెట్టూరు: మండలంలోని కర్ణాటక సరిహద్దు..బండేమారెమ్మ ఆలయం సమీపంలో బుధవారం రాత్రి బైక్ అదుపు తప్పి మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, మంజునాథ గాయపడ్డారు.

అనగానదొడ్డిలో క్షుద్రపూజల కలకలం

గుత్తి రూరల్: అనగానదొడ్డి గ్రామంలో క్షుద్ర పూజలు, చేతబడుల చేయడంపై కలకలం రేగింది. వివరాలు... గ్రామ శివారులో రైతు హనుమంతురెడ్డి పొలం పక్కన పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన గోపాల్, రామాంజనమ్మ బుధవారం క్షుద్రపూజలు చేస్తుండటాన్ని పక్క పొలాల్లోని రైతులు గమనించారు. విషయం తెలియడంతో పెద్ద ఎత్తున గ్రామస్తులతో కలసి అక్కడికి రైతులు చేరుకున్నారు. క్షుద్రపూజలు, చేతబడి చేస్తున్న గోపాల్, రామాంజనమ్మకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ నబీరసూల్ విచారణ చేపట్టారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ల్యాండ్ సర్వేయర్ కోర్సులపై నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీడబ్ల్యూడీ కార్యాలయ ఆవరణలో గల న్యాక్ కేంద్రంలో ఈ నెల 25 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి కలిగిన వారు 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 7013858450, 99086 20306 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యువకుడికి తీవ్రగాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని విలేజ్ మార్ట్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. చెట్నేపల్లికి చెందిన ఆంజనేయులు పట్టణంలో పని ముగించుకుని స్వగ్రామానికి స్వగ్రామానికి బయలుదేరాడు. విలేజ్ మార్ట్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పండ్ల మొక్కలు కాపాడండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఉపాధి హామీ కింద సాగు చేసిన పండ్ల మొక్కలను రైతులు కాపాడుకోవాలని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది సమావేశం ఏర్పాటు చేశారు . ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లవచ్చన్నారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాల స్వీకరణకు గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నారు. ఈమేరకు డీఎం నారాయణస్వామి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 9959225855 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన తెలియజేశారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో భరోసా


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 11వ వార్డు సచివాలయంలో రెండో విడత జగనన్న సురక్ష శిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్యులు విష్ణుమూర్తి, వెంకట రమణారెడ్డి రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, కౌన్సిలర్లు ఫరూక్, రూపావతి, అంజలి, నరేష్, వాల్మీకి శివ, పట్టణ కన్వీనర్ పీరా, ఉపాధ్యక్షులు వాల్మీకి శివప్రసాద్, షఫి తదితరులు పాల్గొన్నారు.
గార్లదిన్నె: బూదేడులో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య పేర్కొన్నారు. శిబిరంలో స్పెషల్ డాక్టర్లు, స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణులు, ఎముకల డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారన్నారు.